క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



కమలాపూర్ : మండలంలోని కానిపర్తికి చెందిన తమ్మడబోయిన సంపత్ ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ ఇ.హరికృష్ణ శనివారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించారు.

ఐనవోలులో..

ఐనవోలు : వరంగల్‌కు చెందిన వెల్డి రాజు ఐనవోలు జాతర పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఫోన్‌ను ట్రేస్ చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్‌కుమార్ బాధితుడికి అప్పగించారు.

హనుమాన్ మాలధారులకు అన్నదానం



వేలేరు : కుల, మతాలకు అతీతంగా హిందు, ముస్లీంలు అన్నదమ్ముళ్ల కలిసి ఉండాలని మాజీ ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హనుమాన్ మాలధారులకు అన్నదానం చేశారు. స్థానిక రుద్ర రామేశ్వరాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి హనుమాన్ స్వాములకు అన్నదానం చేపట్టారు. సలీంమాలిక్, హనుమాన్ స్వాములు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన బిల్లా ఎల్లయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. మాజీ సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎల్లయ్య మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులకు రూ. 2వేలు సాయం అందించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు హనుమకొండ అజర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు డయాబెటిస్, గుండె సంబంధిత పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయనున్నట్లు ఈ సందర్భంగా వివరించారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్‌లోని మోడల్ స్కూల్ (ప్రభుత్వ జూనియర్ కళాశాలలో) ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం అర్హత కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో 40 సీట్లు చొప్పున ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి మెరిట్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని వివరించారు. మండలానికి చెందిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఉచిత విద్య అందిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

చెన్నారావుపేట : ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని ఉప్పరపల్లిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు మండల అంజిగౌడ్ తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న సయమంలో ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడిపోయాడు. ఈ ప్రమదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలు గమనించి అంజిగౌడ్‌ను చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

మండల అంజిగౌడ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ కోరారు. అంజిగౌడ్‌ను వరంగల్‌లోని ఆస్పత్రిలో రమేశ్ ఆధ్వర్యంలోని బృందం పరామర్శించింది. ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గాయాల పాలైన, మృతి చెందిన గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఖరీఫ్ సాగుకు రైతన్నలు సన్నద్ధం

- వేసవి దుక్కులపై దృష్టి
- 25న రోహిణికార్తె ప్రారంభం
- ఎరువుల తరలింపు, ఇతర పనుల్లో బిజీ



ఎల్కతుర్తిలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

ఎల్కతుర్తి : వర్షాకాలం సమీపిస్తుండడంతో రైతులు వేసవి దుక్కులు దున్నేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది యాసంగి సాగు పెద్దగా కలిసి రాలేదు. నాటు వేసిన కొద్దిరోజుల్లోనే మోగిపురుగు వ్యాప్తితో పంటలు దెబ్బతిన్నాయి. పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు రైతులను మరింత నష్టాల్లో నెట్టింది. దీంతో ఆశించిన స్థాయిలో రైతులకు దిగుబడి రాకపోవడంతో ఖరీఫ్ పంటలపై ప్రత్యేక దృష్టి వహిస్తున్నారు. ఈ నెల 25వ తేదీన రోహిణికార్తె ప్రారంభం కానుండడంతో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల రైతులు పత్తి, ఇతర పంటలు సాగుచేసేందుకు ముందస్తుగా వేసవి దుక్కులు దున్నేందుకు సిద్ధమయ్యారు. ఈ రెండు మండలాల్లోని కొంత మంది రైతులు ఇప్పటికే వ్యవసాయ భూముల్లో పశువుల ఎరువులను చల్లుతున్నారు. వేసవిలో దుక్కులు దున్నడం వలన ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు సూచిస్తుండడంతో రైతులు పనుల్లో బిజీ అవుతున్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు

వేసవి దుక్కులు దున్నే ముందు పశువుల ఎరువు, కంపోస్టు ఎరువులను భూమిలో చల్లుకోవాలి. దీంతో నేల సారవంతం అవుతుంది. కలుపు మొక్కలు నశిస్తాయి. పురుగు, వివిధ రకాల తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవచ్చు. వేసవిలో భూమి దున్నినప్పుడు శిలీంద్ర భీజాలు నేలపైకి వస్తాయి. వరి వేసే రైతులు పొలం మడులను ఒక్కసారి దున్నడంతో దుక్కి దిగబడకుండా ఉంటుంది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



వేసవి దుక్కులతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్నాం. పంటలో కలుపు మొక్కలు నివారించవచ్చు. తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించవచ్చు. దుక్కులు పాతం చేసుకునే ముందు పశువుల ఎరువు చల్లుకోవాలి. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలి.

– అబ్జల్‌పాషా, ఏఓ, భీమదేవరపల్లి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చెక్క నాగలితో దున్నడం వలన కనీసం 30సెంటిమీటర్ల లోతు నుంచి దుక్కి వస్తుంది. ఫలితంగా దిగుబడి ఎక్కువ వస్తుంది.
- భూమిని అడ్డంగా దున్నాలి. వాడవున దున్నితే వర్షాలు పడినప్పుడు మట్టి కొట్టుకుపోతుంది. ఫలితంగా దిగుబడి తగ్గుతుంది.
- రోటోవేటర్‌తో తక్కువ సమయంలో దుక్కులు దున్నవచ్చు. ప్లవ్‌తో దున్నితే దుక్కి లోతుగా వస్తుంది.
- నాగలితో దున్నితే భూమి చదునుగా ఉంటుంది.
- వర్షం పడగానే పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు మడుల్లో చల్లుకోవాలి.
- విత్తనం విత్తే వరకు రైతులు భూమిని సమాన పద్ధతిలో ఉంచుకోవాలి.
- రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి

విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎల్కతుర్తి : మండలంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ అధికారి లక్ష్మణ్‌నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కోతులనడుమ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా దామెర, చింతలపల్లి, ఇందిరానగర్, గోపాల్‌పూర్, బావుపేట, కోతులనడుమ, వీరనారాయణపూర్, వల్బాపూర్, పెంచికలపేట గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ సెక్షన్ పరిధి ఉప్పల్, కానిపర్తి, మర్రిపల్లిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ సంపత్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

వేలేరులో..

వేలేరు : మండలంలోని పీచర, మల్లికుదుర్ల సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కుమారస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగిల్‌ఫేజ్ విద్యుత్ సరాఫరా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

మట్టి దొంగలపై చర్యలు తీసుకోవాలి

పర్వతగిరి : మండలంలోని పలు చెరువుల నుంచి నల్ల రాగడి మట్టిని కొందరు ఇటుక బట్టీల యజమానులు వారం రోజులుగా అక్రమంగా తరలిస్తున్నారని రైతు సంఘం నాయకులు గోనె రాంచందర్, రౌతు శ్రీనివాస్, అశోక్ తెలిపారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంచందర్, శ్రీనివాస్, అశోక్ మాట్లాడారు. నల్ల రాగడి మట్టి తీయడంతో చెరువుల కింద ఉన్న బావుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని తెలిపారు. రాగడి మట్టి తరలించొద్దని కోరుతూ ఇటీవల అధికారులకు వినతిపత్రం అందజేసినా పట్టించుకోలేదని చెప్పారు. అధికార యంత్రాంగం అక్రమార్కులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



వినతిపత్రం ఇస్తున్న రాంచందర్, నాయకులు

ప్రొఫెసర్ ఫారూఖీకి నివాళి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ బాటనీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్‌ఎం ఫారూఖీ (88) ఈనెల 15న అనారోగ్య సమస్యలతో హనుమకొండలో మృతిచెందారు. 1996వ సంవత్సరంలో ప్రొఫెసర్‌గా ఆయన ఉద్యోగ విరమణ పొందారు. కాగా, బాటనీ విభాగంలో ఫారూఖ్ చిత్రపటానికి శుక్రవారం పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో రిటైర్డ్ ప్రొఫెసర్లు ఎస్.రాంరెడ్డి, ఎన్.రామస్వామి, క్రిస్టోఫర్, కృష్ణారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ముస్తఫా, ఆచార్య షమిత, బాటనీ విభాగం అధిపతి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో గల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, లక్ష్మణాచార్యులు తెలిపారు. ప్రతి సంవత్సరం వైశాఖశుద్ధ ఏకాదశి పర్వదినాన చేపట్టే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 19న శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం, 23న బండ్ల జాతర, 27న (వైశాఖ బహుళ చవితి) రథోత్సవం జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు.

ఆత్మకూరులో నేటి నుంచి

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీరుక్మిణి సత్యభామసమేత వేణుగోపాలస్వామి అధ్యయన బ్రహ్మోత్సవాలు శనివారం సాయంత్రం ప్రారంభమవుతాయని ఆలయ అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



ఉప్పల్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం

అకాల వర్షం.. రైతులకు తీరని నష్టం



గంగిరేణిగూడెంలో నేలవాలిన మొక్కజొన్న



హసన్‌పర్తి: తడిసిన ధాన్యం



ఖిలా వరంగల్ ఇల్లందు ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



పరకాల : వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

శాయంపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షం రైతులను నష్టాల్లోకి నెట్టింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి మండలంలోని మొక్కజొన్న, అరటి తోటలు నేలవాలాయి. గంగిరేణిగూడెం గ్రామానికి చెందిన ఎండి నాసర్ మహ్మద్ సాగు చేసిన మొక్కజొన్న వర్షానికి నేలవాడడంతో కన్నీరు మున్నీరయ్యాడు. శాయంపేట, కొత్తగట్టుసింగారం గ్రామంలో అరటి తోటలు నేలవాలాయి. ఏఓ మధులిత పరిశీలించారు. పంటనష్టం నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు.

పరకాలలో..

పరకాల : అకాల వర్షాలతో చేతికొందిన పంటలు, ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయి బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి పరకాల వ్యవసాయ మార్కెట్‌లో ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దయ్యాయి.

ఖిలా వరంగల్‌లో..

ఖిలా వరంగల్: వివిధ మండలాల్లో గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షం అన్నదాతలను ఆగం చేసింది. కల్లాల్లోకి వరద నీరు చేరడంతో ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం తడిసిపోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లలో జాప్యంతో ధాన్యం తడిసి ఆర్థికంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్ష ప్రభావం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినా పీఏసీఎస్ సొసైటీలు, మెప్మా, ఐకేపీలు ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయలేదని వాపోయారు. నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్ డివిజన్లలో మరింత ఎక్కువగా నష్టం వాటిల్లిందని, ఆరబోసిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయిందని రైతులు కన్నీరు మున్నీరయ్యారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దైంది. ఇప్పటికే కాంటా వేసి బస్తాల్లో నింపిన ధాన్యం కూడా తడిసిపోయింది. వంగపహాడ్, మల్లారెడ్డిపల్లి, పెగడపల్లి, ముచ్చర్ల, నాగారం కొనుగోలు కేంద్రాల వద్ద ఇదే దుస్థితి నెలకొంది. వంగపహాడ్, మల్లారెడ్డిపల్లి, పెగడపల్లి పీఏసీఎస్ పరిధిలో సుమారు మూడువేల కాంటా వేసిన, ఆరబెట్టిన వరిధాన్యం బస్తాలు తడిసిపోయాయి. ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ డిమాండ్ చేశారు. వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం సందర్శించి మాట్లాడారు.

కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

ఎంజీఎం: కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని ఉద్యోగ సంఘం ప్రతినిధులు కోరారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించేందుకు శుక్రవారం నగరానికి వచ్చిన వైద్యారోగ్యశాఖ కమిషనర్ కర్ణన్‌ను సంఘం నాయకులు కలిసి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు ఇంతవరకు అందలేదని, అవి అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఏడు నెలల పీఆర్సీ ఎరియర్స్ కూడా అందించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్ ఖన్నా, ఆర్‌బీఎస్‌కె వైద్యుల సంఘం అధ్యక్షుడు గుండా రవీందర్, కోశాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్, డైక్ మేనేజర్ అనిల్‌కుమార్, సైకాలజిస్టు ప్రశాంత్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

సన్మార్గమే దైవభక్తికి నిజమైన నిదర్శనం



ఊరు పండుగ వేడుకలో పాల్గొన్న భక్తులు



ప్రసంగిస్తున్న పీఠాధిపతి పూల ఆంథోని

చెన్నారావుపేట : సన్మార్గంలో పయనించడమే దైవ భక్తికి నిజమైన నిదర్శనమని హైదరాబాద్‌కు చెందిన అగ్ర పీఠాధిపతులు కార్డినల్ పూల ఆంథోనీ స్పష్టం చేశారు. మండలంలోని తిమ్మరాయినిపహాడ్‌లో విచారణ గురువు తుమ్మ యాగారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన శతవత్సర గ్రామ ఆవిర్భావ జూబ్లీ వేడుకలు శుక్రవారం ముగిశాయి. తొలుత సమిష్టి దివ్య బలి పూజ నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి పూల ఆంథోనీ మాట్లాడారు. ప్రజలు దేవుడు చూపిన బాటలో నడుచుకోవాలని సూచించారు. ప్రభువు వంద సంవత్సరాలుగా ప్రజలను ఆశీర్వదిస్తున్నాడని చెప్పారు. అన్ని కుటుంబాలను ఉన్నతంగా ఉంచాడన్నారు. ప్రజలందరూ సుభిక్షంగా జీవించాలని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి ఎదుట ఏర్పాటు చేసిన రక్షణ పతాక స్తూపాన్ని ఆవిష్కరించారు. గుడి పెద్దలు పీఠాధిపతులను, గ్రామంలో పరిచర్య చేసిన గురువులను సన్మానించారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి

హన్మకొండ చౌరస్తా: వరకట్న, లైంగిక, ఇతర వేధింపులకు గురవుతున్న బాధిత మహిళలు, బాలికలకు సఖి వన్‌స్టాప్ సెంటర్ అండగా నిలబడుతోందని సెంటర్ కేస్ వర్కర్ వినీల తెలిపారు. మహిళా చట్టాలపై హనుమకొండలోని గుడిబండల్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మహిళలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు కారణాలతో విడిపోయే భార్యభర్తలకు కౌన్సెలింగ్ ద్వారా ఒక్కటి చేయడం, లైంగిక వేధింపులకు పాల్పడితే న్యాయపరమైన సాయాన్ని సఖి అందిస్తోందని వివరించారు. మహిళలకు రక్షణ కల్పించడం కోసం సఖి సెంటర్ పనిచేస్తోందని, సమస్యలపై 0870 – 2452112, లేదా టోల్‌ఫ్రీ నంబర్ 181కు ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని అన్నారు. బాధిత మహిళలకు సఖి అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పారామెడికల్ సిబ్బంది సరిత, ఆర్‌పీ రమాదేవి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి: గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ రవి తెలిపారు. టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీ పార్లర్‌లో 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 18 – 45 ఏళ్ల వయస్సు గల నిరుద్యోగ మహిళలు అర్హులని పేర్కొన్నారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన వారికి శిక్షణ కాలంలో ఉచిత వసతితో పాటు భోజన సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల వారు 4 పాస్‌సైజ్ ఫొటోలు ఆధార్, రేషన్‌కార్డుతో పాటు విద్యార్హత ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలతో సంస్కృతి విహార్, హసన్‌పర్తిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 98493 07873 నంబర్‌ను సంప్రదించాలని డైరెక్టర్ రవి కోరారు.

స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలి

హన్మకొండ అర్బన్: యువత స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు వచ్చి రక్తదానం చేసి తలసేమియా బాధితులను ఆదుకోవాలని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్ కోరారు. రెడ్ క్రాస్ పిలుపు మేరకు పర్వతారోహకుడు రాసమల్ల అఖిల్ తన పుట్టిన రోజు సందర్భంగా స్వచ్ఛందంగా ముందుకువచ్చి రెడ్ క్రాస్ కార్యాలయంలో శుక్రవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ రక్తదానంతో తలసేమియా బాధితులకు పునర్జన్మ ఇవ్వొచ్చని పేర్కొన్నారు. తలసేమియా బాధిత చిన్నారులకు నిత్యం రక్తం అవసరముంటుందని వివరించారు. అపోహలు వీడి రక్తదానానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాత అఖిల్‌కు సర్టిఫికెట్ అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, శాశ్వత సభ్యులు కన్నె రాజు, రాసమల్ల హారిక, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్ముకొచ్చిన కారుమబ్బులు



ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు సాయంత్రం 5గంటలకు వాతావరణం చల్లబడడంతో కొంత ఉపశమనం పొందారు. సాయంత్రం చల్లనిగాలి వీస్తూ కారుమబ్బులు కమ్ముకుని చీకటిగా మారింది. దాంతో వాహనదారులు హెడ్ లైట్లు వేసుకొని నెమ్మదిగా వెళ్లారు. అనంతరం చిరుజల్లులతో వాతావరణం ఆహ్లాదంగా కనిపించగా.. ఈ దృశ్యాన్ని సాక్షి తన కెమెరాలో బంధించింది.

– ఎల్కతుర్తి

ఘనంగా ఆరాధన హోమం

ఎల్కతుర్తి : మండలంలోని పెంచికలపేట గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన హోమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ దంపతులు సామెల జమున–సురేష్ దంపతులు హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సామెల మల్లారెడ్డి, రమణాచారి, శ్రీనివాస్, తిరుపతి, సాంబయ్య తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు